సాక్షి మహబూబాబాద్

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో ర్యాలీ నిర్వహించారు. - 8లో▸



ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు కేసీఆర్ కుట్ర - 8లో▸

కోట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా కేసీఆర్ కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు.

గరిష్టం/కనిష్టం
39.5^0 /24.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై పలుచోట్ల అకాల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

• డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి



దంతాలపల్లి: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, జిల్లా ఆరోగ్య మహిళ ప్రోగ్రాం అధికారి ఉమాగౌరి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన మహిళలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య మహిళ కార్యక్రమంలో నిర్వహించే పలు చికిత్సలపై వైద్యాధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చైతన్య, స్పందన, ఆరోగ్య శిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన 61వాహనాలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో 29వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తారని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం తెలిపారు. ఇతర వివరాలకు 9441037994, 9492922964 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నాట్య మయూరికి 'బాలరత్న' అవార్డు



కురవి: మండల కేంద్రానికి చెందిన నాట్య మయూరి ముంజాల అర్చన బాలరత్న అవార్డు అందుకున్నట్లు ఆమె తండ్రి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు. మల్కాజ్‌గిరి జడ్జి బూర్గుల మధుసూదన్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు చేతులమీదుగా అర్చన అవార్డు అందుకుంటున్నటుల తెలిపారు.

దోమలతో పలురకాల వ్యాధులు



నెహ్రూసెంటర్: దోమల ద్వారా మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు వస్తాయని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి నెహ్రూసెంటర్ వరకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఫ్రైడే, డ్రైడే పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల బారినుంచి రక్షించుకోవాలంటే మస్కిటో నెట్లు వాడాలని, మురికికాల్వలో వాడిన ఇంజన్ ఆయిల్ పోస్తే లార్వా చనిపోయి దోమల వృద్ధి తగ్గుతుందన్నారు. జ్వరం వస్తే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీలో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, డాక్టర్ బిందుశ్రీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ వెంకట్, డిప్యూటీ మాస్ మీడియా ఇన్‌చార్జ్ కేవీ రాజు, పురుషోత్తం, గోపిచంద్, కృష్ణార్జున్‌రావు, రవూఫ్, రామకృష్ణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొటేషన్‌కు ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ జూనియర్ బాలుర కళాశాలో గన్నీ బ్యాగులను కొనుగోలు చేయడానికి ఆసక్తిగల వారి నుంచి కొటేషన్‌లను ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 29న మధ్యాహ్నం 12 గంటల వరకు కొటేషన్‌ను మానుకోట జిల్లా కేంద్రంలోని ఇల్లెందు–నర్సంపేట బైపాస్ రోడ్డులోని హీరోషోరూం బిల్డింగ్ ప్రాంగణంలో సమర్పించాలన్నారు. వివరాలకు 7396242475 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జేపీఎస్‌ల నిరసన

• ఈ నెల 11తో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి
• రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన
• 28వరకు నిరసన కార్యక్రమాలు
• ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె బాట
• జిల్లాలో 381మంది జేపీఎస్‌లు



నెల్లికుదురు ఎంపీడీఓ శేషాద్రికి సమ్మె నోటీస్ అందజేస్తున్న జేపీఎస్‌లు (ఫైల్)

మహబూబాబాద్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం. గతంలో సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు నత్తనడకన జరిగేవి. దీనిని గమనించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి జూనియర్ పంచాయతీ కార్యదర్శి(జేపీఎస్)ని నియమించింది. మూడు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్‌తో విధుల్లో చేరగా ఆ గడువు పూర్తికాగా.. సీఎం కేసీఆర్ మరో ఏడాది గడువు పెంచారు. అయితే ఈ గడువు కూడా ఈ నెల 11తో ముగియగా.. తమను రెగ్యులర్ చేయాలని జేపీఎస్‌లు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కాగా సంబంధిత ఉన్నతాధికారులకు, మంత్రి దయాకర్‌రావుకు వినతులు అందజేసి ఆ తర్వాత కార్యాలయాల్లో సమ్మె నోటీసులు సైతం అందజేశారు.

సమ్మె నోటీసులు..

జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉండగా 80 మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. 370 జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పని చేస్తుండగా.. 11మంది అవుట్ సోర్సింగ్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిని ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకారం మూడు సంవత్సరాలకే రెగ్యులరైజ్ చేయాలి. కానీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మరో సంవత్సరం గడువు పెంచుతూ సంబంధిత జీఓ 26ను విడుదల చేశారు. కాగా ఈనెల 11తో పెంచిన గడువు పూర్తి కావడంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, సంబంధిత ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. ఈనెల 13న పీఆర్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. అలాగే ఈనెల 15న కలెక్టర్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో సమ్మె నోటీస్‌లు అందజేశారు. అనంతరం ఈ నెల 24 పోస్టు కార్డు ఉద్యమం, 25న అంటెండెన్స్ యాప్ బంద్ చేశారు. 26న అఫీషియల్ వాట్సాప్ గ్రూప్‌ల నుంచి బయటకు రావడం, 27న నిరసన ర్యాలీ, 28వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె బాట పట్టనున్నారు.

నిబద్ధతతో విధులు..

గ్రామాల్లో ఇంటి పన్నులు వసూళ్లు, పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాతో పాటు 36 రకాల రికార్డుల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. అదనంగా ఫీవర్‌సర్వే, ఆర్‌ఓఎఫ్‌ఆర్ సర్వే, బీఎల్‌ఓల విధులు నిర్వర్తిస్తున్నారు. పీఎస్ డీఎస్‌ఆర్ యాప్, పల్లెప్రగతి యాప్, మిషన్ అంత్యోదయ యాప్, జీపీ డీపీఆర్‌తో పాటు పలు యాప్‌ల నిర్వహణ భారంతో సతమతమవుతున్నారు. దీనికి తోడు ఉద్యోగ భద్రత లేక మనోవేదనకు గురవుతున్నారు. వేతనాలు కూడా సమయానికి అందడం లేదు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



జేపీఎస్‌లను త్వరగా రెగ్యులర్ చేయాలి. ఉద్యోగ భద్రత లేక మనోవేదనకు గురవుతున్నారు. నెలనెల వేతనాలు రాక నానా తంటాలు పడుతున్నాం. రెగ్యులరైజ్ చేస్తే ప్రధానంగా ఉద్యోగ భద్రతతో పాటు జీరో వన్ జీరో పద్దు కింద వేతనాలు వస్తాయి.

–చుక్కల ప్రవీణ్,
జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

హామీని నిలబెట్టుకోవాలి



సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఇప్పటికే సమ్మె నోటీస్‌లు ఇచ్చాం. ఈనెల 28 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అప్పటికి ప్రభుత్వం స్పదించకపోతే సమ్మెబాట పడుతాం. ఈ లోపు సీఎం స్పందిస్తారని ఆశతో ఎదురు చూస్తున్నాం.

–శ్రీకాంత్ గౌడ్,
జేపీఎస్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు న్యాయం

• మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు న్యాయం చేకూరుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో చేపట్టిన ప్లీనరీకి వెళ్తున్న క్రమంలో మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకులతో మంత్రి కాసేపు మాట్లాడారు. ముందుగా మహిళలు, నాయకులు కోలాటాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్లీనరీకి వెళ్తున్న వారికి కల్పించిన సదుపాయాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమనేత సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించి కొత్త రాజకీయాలకు తెరతీశారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుందన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజలు అండగా నిలిచారని అదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు రైతులు, మహిళలు, కులవృత్తులు, అన్నీ వర్గాల ప్రజలను ఆకర్షించాయని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. ఇటీవల తెలంగాణ పల్లెలకు 13జాతీయ అవార్డులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, బొమ్మకల్లు ఎంపీటీసీ బానోతు రవీందర్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, అనపురం రవి, బోపగిరి లింగమూర్తి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి

• ఎస్పీ శరత్‌చంద్ర పవార్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: ఆపదలో ఉన్న మహిళలకు షీ టీమ్స్, భరోసా సెంటర్ అధికారులు, సిబ్బంది భరోసా కల్పించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని షీ టీమ్స్, భరోసా కేంద్రాన్ని ఎస్పీ మంగళవారం సందర్శించారు.అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా భద్రత కోసం షీ టీమ్స్, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. షీ టీమ్స్ సిబ్బంది మహిళా భద్రత, ఇతర అంశాలపై అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధాన సెంటర్లతో పాటు స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో యువతులు, మహిళలను వేధించే ఆకతాయిలను షీటీమ్స్ సిబ్బంది కట్టడి చేయాలన్నారు. భరోసా సెంటర్‌లోని సిబ్బందితో మాట్లాడి వారు చేసే పనిని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ఎలా పనిచేస్తుంది, బాధితులకు కౌన్సెలింగ్, ఒకేచోట వైద్య, న్యాయ సలహాలు ఎలా అందిస్తున్నారు, పునరావాసం కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. లైంగికదాడులు, పోక్సో కేసుల్లో బాధితులకు ఒకేచోట అన్నిరకాల సేవలు అందిచడం చాలా గొప్ప విషయం అన్నారు. షీ టీమ్స్ ఇన్‌చార్జ్ సీఐ రవి కుమార్, టౌన్ సీఐ సతీష్, ఎస్బీ సీఐ ఫణిధర్, షీ టీమ్స్ ఎస్సైలు సునంద, దీపికారెడ్డి, ఏఎస్సై ఆనందం పాల్గొన్నారు.

నివేదికలు అందజేయాలి

• కలెక్టర్ శశాంక



పాత కార్యాలయాల భవనాలను పరిశీస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

మహబూబాబాద్: జిల్లాలో పంటల నష్టం వివరాల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పంటల నష్టంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 11,677ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలి..

ఇటీవల మంజూరైన రూ.10లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని, అందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లులు, డ్రెయినేజీలు, ఇతర పనులకు ఖర్చు చేసుకోవాలన్నారు.

అవసరాల మేరకే భవనాల కేటాయింపు

అవసరాల మేరకే పాత కార్యాలయాల భవనాలను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం కలెక్టర్ పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనాలు, డీఎంహెచ్‌ఓ కార్యాలయం, ట్రెజరీ, ఇతర కార్యాలయాలను పరిశీలించి అవసరం మేరకు వాటిని పలు ఆఫీస్‌లకు కేటాయించేందుకు అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ముందుగా పాత కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించి యూత్ ట్రైనింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నందున త్వరగా ప్రారంభించాలన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం, డీపీఓ కార్యాలయ భవనాల గదులను పరిశీలించి, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డీఆర్‌డీఏ కార్యాలయంలో శిశు సంక్షేమ శాఖ, చిల్డ్రన్స్ హోం, మహిళా ప్రాంగణ నిర్వహణకు పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట డీడబ్ల్యూఓ వరలక్ష్మి, ఏటీడబ్ల్యూఓ సత్యవతి, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం..

• వందకు పైగా అసెంబ్లీ స్థానాల్లో గెలుస్తాం
• బీఆర్‌ఎస్ ప్లీనరీలో ఎంపీ మాలోత్ కవిత



మానుకోటలో మాట్లాడుతున్న ఎంపీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మహబూబాబాద్: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని, 100పైగా అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం స్థానిక ఆర్తి గార్డెన్‌లో మానుకోట నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అధ్యక్షత వహించగా.. ముందుగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఎంపీ కవిత మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో లేని పథకాలను కూడా అమలు చేశారన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని మాట్లాడడం సరికాదని, ముస్లింలు కూడా భరించలేరన్నారు. తెలంగాణపై ప్రేమ ఉంటే అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు రూ.5,000కోట్లు కేటాయించాలన్నారు. మానుకోట గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలపై గ్రామాల్లో చర్చపెట్టి పార్టీ మరింత బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మానుకోట కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంటే.. బీఆర్‌ఎస్ ఆ కోటను బద్దలుకొట్టి రెండుసార్లు గెలిచిందని, మూడోసారి కూడా గెలుపు తథ్యమన్నారు. కాగా తనకు మరో అవకాశం కల్పించనున్నారని, సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మహ్మద్ ఫరీద్, భరత్‌కుమార్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, బాలాజీ నాయక్, వెంకన్న, రవి, మహబూబ్‌పాషా, ముత్యం వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి, రాజశేఖర్, జెడ్పీటీసీలు రావుల శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రియాంక, ఎంపీపీలు మాధవి, మౌనిక నాయకులు వెంకట్‌రెడ్డి, ఖాసీం, రాజు, కిరణ్, ప్రభాకర్, బాలు, రావిష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

మరిపెడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చర్చపెట్టాలని మానుకోట ఎంపీ మాలోత్ కవిత అన్నారు. మంగళవారం మరిపెడలోని వంటికొమ్ము లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ డోర్నకల్ నియోజవర్గస్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముందుగా డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్‌పార్టీ పలు రకాల కార్యక్రమాలు చేపట్టి కార్యకర్తలను చైతన్యపరుస్తుందన్నారు. మీకు కూలీగా నియోజవవర్గంలో ఉంటూ సేవ చేసే రెడ్యానాయక్‌ను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఎంపీ కార్యకర్తలను కోరారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ఇక్కడ మరోసారి నాకు ఓటు వేసి గెలిపిస్తే అక్కడ కేసీఆర్ కూడా ముచ్చటగా ముడోసారి ముఖ్యమంత్రి అవుతాడన్నారు. ఇటీవల నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల పాదయాత్రలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనపై చేసిన తప్పుడు ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేని క్రమంలో రేవంత్‌రెడ్డి 10 చెప్పు దెబ్బలు తినాలని ఎమ్మెల్యే ఘాటుగా విమర్శించారు. అనంతరం ప్లీనరీలో 10 తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, డోర్నకల్ యువజన నాయకులు డీఎస్ రవిచంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్లు సింధూర, వీరన్న, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలు షురూ..



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు 577మంది విద్యార్థులకు 498మంది హాజరై 79మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 729మంది విద్యార్థులకు 617మంది హాజరై 112మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి అనారోగ్యం కారణంగా పరీక్ష రాయలేకపోయాడు. ఈ క్రమంలో వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆ విద్యార్థిని ఆటోలో ఇంటికి పంపించారు. కాగా ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స అందించడానికి వైద్య సిబ్బందిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్లీనరీకి ఎమ్మెల్సీ అనుచరులు డుమ్మా

• ఇటీవల జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి గైర్హాజర్
• హాట్‌టాపిక్‌గా మారిన వ్యవహారం



ప్లీనరీకి దూరంగా ఉండి జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్సీ అనుచరులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ మానుకోట నియోజకవర్గస్థాయి ప్లీనరీ సమావేశానికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అనుచరులు హాజరుకాలేదు. ఆయన అనుచరులైన మంగళంపల్లి కన్నా, జెర్రిపోతుల వెంకన్న, మురళి, యాకయ్య, వెంకటాద్రి, మహేందర్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, హరిసింగ్, విజయమ్మ, బుజ్జి వెంకన్న, కోఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్ గైర్హాజరయ్యారు. అయితే ప్లీనరీకి ముందు పార్టీ జిల్లా కార్యాలయంలో ఎంపీ మాలోత్ కవిత ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా తమకు ఆహ్వానం అందలేదని ఈనెల 20న పార్టీ పట్టణ ఆత్మీయ సమ్మేళనానికి కూడా ఎమ్మెల్సీ అనుచరులు హాజరుకాలేదు. కాగా వరుసగా జరిగిన రెండు కార్యక్రమాలకు ఎమ్మెల్సీవర్గం దూరంగా ఉండడం ఇప్పుడు పార్టీలో హాట్‌టాపిక్ మారింది.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు దోహదం



తాగునీటిని అందజేస్తున్న డీఎస్పీ రఘు

తొర్రూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని డీఎస్పీ రఘు అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ కంట్రోల్‌రూం వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ పాల్గొని సీఐ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు, ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు, చల్లనితాగు నీటిని అందించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి పలు రకాల పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు, బాటసారులకు తాగు నీరు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీష్, లింగారెడ్డి, రాంజీనాయక్, పోలీస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఎస్సారెస్పీ కాల్వలు..



టేకులతండా సమీపంలో కాల్వ కట్ట మట్టిని తవ్వీన గుర్తు తెలియని వ్యక్తులు



జోగ్యాతండా సమీపంలో కాల్వలో పడిన బండరాళ్లు



చిలుకోడు సమీపంలో అడ్డుగా రాతిగోడ ఏర్పాటు

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఎస్సారెస్పీ కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో చాలా ప్రాంతాల్లో కాల్వ కట్టలు ఆక్రమణకు గురయ్యాయి. టేకులతండా సమీపంలో కొంతమంది వ్యక్తులు కాల్వ కట్ట మట్టిని జేసీబీ సాయంతో తరలించారు. అలాగే చిలుకోడు ఫకీరాతండా మార్గంలో తన భూమి నుంచి కాల్వ నిర్మాణం చేపట్టవద్దంటూ ఓ రైతు కాల్వకు అడ్డుగా రాతికట్టను నిర్మించారు. జోగ్యాతండా సమీపంలో ఓ రైతు తన వ్యవసాయ భూమిలోని పెద్దపెద్ద బండరాళ్లను కాల్వ కట్టపైకి చేర్చగా.. కొన్ని కాల్వలో పడడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. అలాగే కాల్వ లైనింగ్ దెబ్బతింది. వెన్నారం గ్రామ సమీపంలో ఓ రైతు కాల్వ కట్ట స్థలాన్ని ఆక్రమించి హద్దు రాళ్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో మట్టి నిండి మూసుకుపోయాయి. ఇలా పలు కారణాలతో కాల్వలు పూర్తిగా ధ్వంసమై ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల ఆక్రమణలను అరికట్టి, నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాకు బహుమతిగా ఇద్దాం

● కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కాజీపేట/మడికొండ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీకి బహుమతిగా ఇద్దామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌నుంచి ప్రారంభమై గోపాలపురం క్రాస్‌రోడ్డు, సమ్మయ్యనగర్ మీదుగా గోకుల్‌నగర్, కలెక్టరేట్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కేసీఆర్‌ను ఓడించాలన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట దిగుబడులను కోల్పోయి ఆచేతనంగా మిగిలిన రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో రాత్రి బస

భట్టి యాత్ర రాత్రి 9.30 గంటలకు మడికొండకు చేరుకుంది. వాసవిమాత కల్యాణ మంటపంలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అక్కడినుంచి పాదయాత్ర ద్వారా మడికొండ చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరినుంచి ధర్మసాగర్ మండలానికి వెళ్తారని పార్టీ నేతలు తెలిపారు.

ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు

కేసీఆర్ కుట్ర

● ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వీర్యం
● సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
● కేయూలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి
● కష్టాలు, సమస్యలు చెప్పుకున్న విద్యార్థులు



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కేయూ క్యాంపస్: కొట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా కేసీఆర్‌కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత పలువురు నిరుద్యోగ విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే మాకు ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉద్యోగాల భర్తీచేయలేదన్నారు. చివరికి ఇచ్చిన నోటిఫికేషన్లలో పేపర్ల లీకేజీతో పలు నోటిఫికేషన్లు రద్దుచేశారని అన్నారు. తాము కుటుంబాలకు దూరంగా ఉండి కష్టపడి చదుకుంటున్నామని యూనివర్సిటీల ప్రైవేటీకరణ, గ్రూప్ పేపర్ల లీకేజీ, గురుకుల పోస్టుల ఉద్యోగాల రిజర్వేషన్ల ఇబ్బందులు సమస్యలను విద్యార్థులు సీఎల్పీ నేత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాకతీయ యూనివర్సిటీ ఒక పెద్ద వర్సిటీగా, ఎన్నో ఉద్యమాలకు, భావజాలాలకు, సామాజిక మార్పులకు వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం లేకుండా 70 ఏళ్లనాటి ఫ్యూడల్ వ్యవస్థను పునరుద్ధరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నీళ్లు లేవు.. నిధులు లేవు.. నియామకాలు లేకుండా చేశారు. ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేరేవరకూ విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క యూనివర్సిటీని కూడా కొత్తగా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలను మాత్రం ఏర్పాటు చేస్తుందన్నారు. రూ.5లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ప్రభుత్వం కేసీఆర్ ఇంకా కొనసాగితే రాష్ట్రంలోని యూనివర్సిటీల భూములను కూడా అమ్మేస్తాడని ఎద్దేవా చేశారు. త్వరలో టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాస్తానని చెప్పారు. పేపర్ లీకేజీలు చేసినా.. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడం లేదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు మాట్లాడారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌రావు, శోభ, రవళిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కేయూ విద్యార్థి జాక్ కన్వీనర్ పర్లపెల్లి శ్రీశైలం, ఆలువాల కార్తిక్, బొట్ల మనోహర్, బండి రాకేష్, డాక్టర్ తీగల ప్రేమ్ సుందర్, హెచ్ భగత్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఐలేష్, మధుకర్‌రావు, మంద నరేష్ ఇట్టబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కచ్చితమైన వాటా ఇవ్వాలి



గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులలో 75శాతానికిపైగా మహిళలకే కేటాయించారు. పురుష అభ్యర్థులు నష్టపోతున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. వారి కోటా వారికి ఇవ్వాల్సిందే. అదే విధానాన్ని చట్టసభల్లో కూడా కేసీఆర్ అమలు చేయాలి.

– రాజశేఖర్, నిరుద్యోగ విద్యార్థి

రూ.5 భోజనం తింటూ చదువుతున్నాం



విద్యార్థుల లక్ష్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం లక్షలకు అమ్ముకుంటోంది. రూ.5 భోజనం తింటూ.. చదువుకుని ఉద్యోగాలకు ప్రిపేరవుతున్నాం. రోస్టర్ పాయింట్లు చూస్తుంటే దడ పుట్టోంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. కానీ పురుషుల కోటా మాత్రం కచ్చితంగా అమలు చేయాలి.

– దొంగ్రూ కచ్రూ, నిరుద్యోగ విద్యార్థి

నిట్‌లో కొలువుల సంబురం



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో దుర్గాప్రసాద్, ఎన్వీ.రమణారావు

● ఉద్యోగ సాధనకు నిట్ అక్షయపాత్ర
● టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్
● 268 కంపెనీల్లో 1,410 మందికి ఉద్యోగాలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో కొలువుల సంబురం మంగళవారం అంబరాన్నంటింది. నిట్ వరంగల్‌కు చెందిన 1,410 మంది విద్యార్థులు 268 కంపెనీల్లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించారు. నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అక్షయ క్యాంపస్ సెలక్షన్స్ సక్సెస్ మీట్‌ను టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా ప్రారంభించి, మాట్లాడారు. తాను నిట్ వరంగల్‌లోనే బీటెక్ పూర్తి చేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించి నేడు టెక్ మహీంద్రా కంపెనీకి సీటీఓగా పని చేస్తున్నానని తెలిపారు. ఉత్తమ విద్యకు, అత్యుత్తమ ఉద్యోగ సాధనకు నిట్ వరంగల్ క్యాంపస్ అక్షయపాత్ర లాంటిందని కొనియాడారు. నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు నిట్ వరంగల్ గౌరవాన్ని ప్రపంచానికి చాటాలని తెలిపారు. నిట్ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్స్‌కు సీసీపీడీ(సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ద్వారా ఉద్యోగాలను అందించేందుకు ప్రపంచంలోని కంపెనీలు పోటీపడుతున్నాయని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిట్‌కు చెందిన ఆదిత్య సింగ్ రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలక్ట్ అవ్వడమేనని అన్నారు. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించిన 1,410 మంది విద్యార్థులకు సీసీపీడీ క్యాంపస్ సెలక్షన్స్ పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీసీపీడీ హెచ్ డేవిడ్‌సన్, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యాబోధనతోనే మంచి ప్యాకేజీ..



న్యూఢిల్లీలోని ఫరీదాబాద్ నుంచి నిట్ వరంగల్‌లో బీటెక్ సీఎస్ఈ కోసం వచ్చా. ఇక్కడి విద్యార్థుల పోటీతత్వంతో ప్రేరణ పొందాను. నిట్ అధ్యాపకుల ఉత్తమ బోధనతోనే క్యాంపస్ సెలక్షన్స్‌లో తోస్పాట్ బెంగుళూరుకు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను.

– ఆదిత్య సింగ్, సీఎస్ఈ, రూ.88లక్షల ప్యాకేజీ

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ లక్ష్యం



నేను వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేస్తాను. నిట్‌లో ఎంఎస్సీ మాథ్స్ పూర్తి చేశాను. పూనేలోని సిటీ బ్యాంక్‌లో రూ.12లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను. కంపెనీ పెట్టి మరింతమందికి ఉద్యోగాలివ్వడమే నా లక్ష్యం.

– తానీయా అగర్వాల్, ఎంఎస్సీ (మ్యాథ్స్), రూ.12లక్షల ప్యాకేజీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా..



నిట్ వరంగల్‌లో సీఎస్ఈ విభాగంలో బీటెక్ చదువుతున్న తరుణంలోనే సీసీపీడీ చొరవతో క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాను. హైదరాబాద్‌కు చెందిన డీషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.62.5లక్షల ప్యాకేజీకి ఎంపికవడం ఆనందంగా ఉంది.

– సుషీత్‌రెడ్డి, సీఎస్ఈ, రూ.62.5లక్షలు

యూఎస్‌లో మాస్టర్స్ చేస్తా..



యూఎస్‌లో మాస్టర్స్ చేయడమే నాలక్ష్యం. నిట్‌లో ఈఈఈ విభాగంలో బీటెక్ పూర్తి చేస్తూనే క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్నాను. మా ప్రొఫెసర్స్ గైడెన్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్వాల్‌కామ్ కంపెనీలో రూ.29.7లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికవడం సంతోషంగా ఉంది.

– రుచీరా, ఈఈఈ, రూ.29.7లక్షల ప్యాకేజీ

ఉపేందర్ మృతదేహంతో ధర్నా

● మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
● రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్
● విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షలు, ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఎస్ఈ హామీ



మృతదేహంతో రాస్తారోకో నిర్వహిస్తున్న, బంధువులు, అఖిలపక్ష నాయకులు

గార్ల: విధి నిర్వహణలో భాగంగా విద్యుదాఘాతానికి గురై సోమవారం రాత్రి మృతిచెందిన వాంకుడోత్ ఉపేందర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట అఖిలపక్షం నాయకులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో గార్ల నుంచి పోచారం వెళ్లే వాహనదారులకు మూడు గంటపాటు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు చేరుకుని జిల్లా విద్యుత్ శాఖ అధికారులను గార్లకు రప్పించారు. పరిహారం చెల్లింపుపై బాధిత కుటుంబ సభ్యులు అఖిలపక్షం నాయకులతో జిల్లా ఎస్ఈ నరేష్, డీఈ విజయ్, ఏడీఈ రమేష్‌లు కలిసి చర్చలు జరిపారు. విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షలు, విద్యుత్ శాఖ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ నుంచి రూ.20లక్షలు, ఉపేందర్ కుమారుడికి కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని జిల్లా ఎస్ఈ నరేష్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గార్ల సబ్‌స్టేషన్ ఎదుట ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ బాలాజీ నేతృత్వంలో ఎస్సైలు బానోత్ వెంకన్న, రమాదేవి పోలీస్ సిబ్బంది బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ జ్యోతి, అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, దనియాకుల రామారావు, మాలోత్ వెంకట్‌లాల్, భూక్యా నాగేశ్వరరావు, జంపాల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని కుప్పగా చేస్తూ కుప్పకూలిన రైతు

● చికిత్స పొందుతూ మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి దగ్గరికి చేస్తుండగా కుప్పకూలి పడిపోయిన ఓ రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన రిక్కల వెంకట్‌రెడ్డి(60) తన వరి ధాన్యాన్ని అమ్మేందుకు గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తరలించి ఎండకు ఆరబెట్టాడు. ఈనెల 23న(ఆదివారం) సాయంత్రం వర్షం రావడంతో ధాన్యాన్ని దగ్గరగా కుప్ప చేసే క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి



హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్పౌజ్ టీచర్లు

● హనుమకొండలో ర్యాలీ నిర్వహించిన టీచర్లు

విద్యారణ్యపురి: ఉమ్మడివరంగల్ జిల్లాలో ఇంకా బదిలీ కాని స్పౌజ్ టీచర్లు తమకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 317 జీఓ ద్వారా భర్త ఒక జిల్లా.. భార్య మరొక జిల్లాలో ఉంటూ అనేక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలలుగా నిరీక్షిస్తున్నామని తమ ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేసినప్పటికీ మిగిలిన అందరినీ బదిలీ చేయాలని కోరారు. అలాగే ఎస్‌జీటీ కేటగిరి స్పౌజ్ టీచర్లకు ఇప్పటివరకు బదిలీలు చేపట్టలేదని తమ ఆవేదనను ప్లకార్డుల వెలిబుచ్చారు. హనుమకొండలోని డీఈఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రంను సమర్పించారు. ఈసందర్భంగా స్పౌజ్ టీచర్ల ఫోరం బాధ్యులు కందగట్ల సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తమ మాటను నిలుపుకోవాలని కోరారు. వేణుగోపాల్, శ్రీనివాసస్వామి, శ్రీహరి, శరత్, రాంగోపాల్‌రెడ్డి, హుస్సేన్, రమాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌసియా, హేమలత, శ్రీపాల్, నరిసయ్య, భాస్కర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

● హనుమకొండ, వరంగల్‌లో వంద శాతం హాజరు
● టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 90 శాతం హాజరు



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లోని రెండు జేఏసీలతో వేతన సవరణ ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న ఈ రెండు యూనియన్లు యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చాయి. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మెకు వెళ్లాయి. కానీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. మరో వైపు విద్యుత్ సంస్థల్లో సమ్మెను నిషేధాన్ని విధించింది. ఆర్టిజన్‌లు సమ్మెకు వెళ్తే ఎస్మా కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. ఈ క్రమంలో సమ్మె సందిగ్ధంలో పడ్డది. ఎక్కడ ఎస్మా ప్రయోగించి చర్యలు తీసుకుంటారో.. ఎక్కడ ఉద్యోగాలు ఊడిపోతాయోననే భయాందోళన మధ్య బలవంతంగా ఆర్టిజన్లు హాజరయ్యారు. ప్రధాన సంఘాల మద్దతు లభించకపోవడం కూడా ఆర్టిజన్లు వెనక్కు తగ్గడానికి కారణమని పలువురు ఉద్యోగులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఆర్టిజన్లు సమ్మెకు దూరంగా ఉన్నారు. ఈ రెండు జిల్లాలో వంద శాతం హాజరయ్యారని ఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 189 మంది ఆర్టిజన్లు, వరంగల్ జిల్లాలో 183 మంది ఆర్టిజన్ ఉద్యోగులుండగా అందరు విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. వంద శాతం హాజరుతో జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. కాగా, టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 90శాతం ఆర్టిజన్లు విధులకు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సమ్మె ప్రభావం కనిపించిందని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ భవన్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా వారి వివరాలు తెసుకున్నాకే లోపలికి అనుమతించారు.

బతుకుదెరువు కోసం వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు



ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

దేవరుప్పుల : బతుకు దెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ తాత చనిపోగా, మనుమడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట- జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డీఎస్ భుజంగరావు



నూతన కార్యవర్గం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ (డీఎస్) డి.భుజంగరావు అన్నారు. కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ 10వ జనరల్ బాడి, నూతన కార్యవర్గం ఎంపికలో భుజంగరావు మాట్లాడారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో రైల్వే డ్రైవర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డు స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే డీఎంఓ డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు ఆరోగ్యంగా జాగత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైల్వే సంఘ్ ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.రవి, వర్కింగ్ చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, వైస్ చైర్మన్లుగా శృతి, జి.లక్ష్మీయనారాయణ, గుప్తా, సెక్రటరీగా చింత మురళి, అసిస్టెంట్ సెక్రటరీలుగా జి.వరప్రసాద్ రెడ్డి, మేరుగు శివ, సీహెచ్.పరమేశం, ట్రెజరర్‌గా పి.సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు వి.మురళీకృష్ణ, ఎస్.వెంకటనారాయణ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.